RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




RANGAREDDY, EDITION : 01, VOLUME :173 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 07 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 173 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 07 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



## బిల్లులపై నాన్చుడు ధోరణి వద్దు

- ఆమోదం పొందిన బిల్లులపై గవర్నర్లు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి
- సుప్రీంకోర్టు వరకు ఈ విషయాల్ని లాగొద్దు
- గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- గవర్నర్లు ప్రజాప్రతినిధులు కారు
- ప్రజల చేత ఎన్నుకోబడిన వారు కాదన్న విషయాన్ని మరచిపోకూడదు
- గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

రాష్ట్ర శాసనసభ ఆమోదం పొందిన బిల్లులను ఎటూ తేల్చకుండా వాటి విషయంలో గవర్నర్లు నాన్చివేత ధోరణిని విడనాడాలని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇలాంటి సంస్కృతికి ముగింపు పలకాలని సూచించింది. గవర్నర్లు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు కాదన్న విషయాన్ని మరచిపోకూడదని సూచించింది. పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ ఎటూ తేల్చక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం

మిగతా 2లో

# సింగరేణి తెలంగాణ సొత్తు

### ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

'ఢిల్లీ గులాముల కింద ఉండే పార్టీకి ఓటేసి గులాములు అవుదామా..? రాబోయేది ప్రాంతీయ పార్టీల యుగం.. ఎక్కడోళ్లు అక్కడ పాలించుకుంటేనే ఉత్తమం' అని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో మాటలకు పరిమితి ఉందన్నారు. ఓ అర్భకుడు బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనీయనని అంటున్నాడు.. ఖమ్మాన్ని ఆయన కొనేశాడా అని ప్రశ్నించారు. ఒకాయన నేను మంత్రి పదవి ఇచ్చానంటే.. ఆయనే నాకు మంత్రి పదవి ఇచ్చాను అంటున్నాడు.. ఎవరికి ఎవరు మంత్రి పదవి ఇచ్చారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. పువ్వాడను గెలిపిస్తే పువ్వుల్లో పెట్టుకొని చూసుకుంటారని, తుమ్మలకు ఓటు వేస్తే తుమ్మముళ్ల పాలుజేస్తారని తెలిపారు. కమ్యూనిస్టు



పార్టీలు చైతన్యం తెచ్చిన నేల ఇది అన్నారు. ఓటును సరైన పద్ధతిలో వాడాలని సూచించారు. నాడు ఖమ్మం ఇరుకు సందులు, మురికి కాల్వలతో ఉండేదని, ఇప్పుడు రోడ్లు, లైట్లు, పచ్చని చెట్లతో

మిగతా 2లో




## రేపు హైదరాబాద్‌కు ప్రధాని మోడీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాకతో రేపు హైదరాబాద్ నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. రాజ్ భవన్, ఎల్బీస్టేడియం సభ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా ఉన్నతాధికారుల సూచనలతో ఎన్టీఆర్ గార్డెన్, లుంబిని పార్క్ లను మూసివేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అధికారులు నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ రేపు సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 5: 25 నుంచి 6: 15 గంటల వరకు ఎల్బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించే బీసీ గర్జన సభలో పాల్గొంటారు. తిరిగి సాయంత్రం 6.30 గంటలకు బేగంపేట నుంచి ఢిల్లీకి వెళ్లిపోతారు.

## గాజాను రెండుగా విభజించిన ఇజ్రాయిల్ సైన్యం



**టెల్‌అవీవ్ - ప్రభాత సూర్యుడు:** అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం గాజా సిటీని చుట్టుముట్టడంతో పాటు .. గాజాను ఉత్తర గాజా, దక్షిణ గాజా అని రెండు భాగాలుగా విభజించింది. "గాజా నగరాన్ని మేం చుట్టుముట్టాం. ఇప్పుడు ఇక ఉత్తర గాజా, దక్షిణ గాజాగా విభజించాం. ఈ యుద్ధంలో ఇది చాలా ముఖ్యమైన దశ. మేం మరింత కీలకంగా దాడులు చేయబోతున్నాం" అని ఇజ్రాయెల్ ఆర్మీ అధికార

మిగతా 2లో

## జబాలియా శరణార్థి శిబిరంపై మళ్లీ దాడి

- పదివేలకు చేరిన గాజా మృతుల సంఖ్య
- అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ

**గాజా సిటీ - ప్రభాత సూర్యుడు:** గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ మరోసారి దాడి చేసింది. బురేజ్ శరణార్థి శిబిరంపై దాడి తరువాత జబాలియాపై విరుచుకుపడింది. ఈ దాడిలో 20 మంది చని పోగా, అనేకమంది గాయపడ్డారు. గత నెల రోజుల్లో ఇజ్రాయిల్ రాక్షసత్వానికి 10వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారు. ఒకవైపు ఈ మారణకాండకు ఇజ్రాయిల్‌ను ఎగదోస్తూ, మరోవైపు పాలస్తీనా

మిగతా 2లో



### ఏఐజీ ఆసుపత్రిలో
## చంద్రబాబుకు వైద్య పరీక్షలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆసుపత్రిలో టిడిపి అధినేత చంద్రబాబుకు మరోసారి పలు వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం చంద్రబాబు ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్నారు. చంద్రబాబు చర్మ సంబంధిత సమస్యలకు డాక్టర్లు చికిత్స చేయనున్నారు. ఇప్పటికే రెండు రోజులపాటు ఏఐజీలో చంద్రబాబుకు వైద్య పరీక్షలు జరిగాయి. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో కంటి పరీక్షలు కూడా చేయించుకున్నారు. రేపు చంద్రబాబు కంటికి క్యాటరాక్ట్ ఆపరేషన్ జరగనుంది.




# కాంగ్రెస్ మూడో జాబితా విడుదల

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 14 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి బరిలోకి దిగనున్నారు. బోథ్, వనపర్తి స్థానాలకు రెండో జాబితాలో ప్రకటించిన అభ్యర్థులను మార్పు చేసింది. వనపర్తిలో చిన్నారెడ్డి స్థానంలో తూడి మేఘారెడ్డి, బోథ్‌లో వెన్నెల అశోక్ స్థానంలో గజేందర్‌కు టికెట్లు కేటాయించింది.

**బరిలో నిలిచే అభ్యర్థులు వీళ్లే..**

చెన్నూర్ (ఎస్సీ)- డా.జి వివేకానంద
బోథ్ (ఎస్టీ)- గజేందర్(వెన్నెల అశోక్ స్థానంలో)
జుక్కల్ (ఎస్సీ) -తోట లక్ష్మీ కాంతారావు



బాన్సువాడ - ఏనుగు రవీందర్ రెడ్డి

కామారెడ్డి- రేవంత్ రెడ్డి
నిజామాబాద్ (అర్బన్) - షబ్బీర్ అలీ
కరీంనగర్ -పురుమళ్ల శ్రీనివాస్
సిరిసిల్ల -కొండం కరుణ మహేందర్ రెడ్డి
నారాయణఖేడ్ -సురేష్ కుమార్ షెట్కర్
పటాన్‌చెరు -నీలం మధు ముదిరాజ్
వనపర్తి -తూడి మేఘా రెడ్డి (జిల్లెల చిన్నారెడ్డి స్థానంలో)
డోర్నకల్ (ఎస్టీ)- డా. రామచంద్రు నాయక్
ఇల్లెందు (ఎస్టీ) -కోరం కనకయ్య
వైరా (ఎస్టీ) -రామదాస్ మాలోత్
సత్తుపల్లి (ఎస్సీ)- మట్టా రాగమయి
అశ్వారావుపేట (ఎస్టీ)-జారె ఆదినారాయణ

## ప్రజాశాంతి పార్టీ తొలి జాబితా

### - 12 మంది అభ్యర్థులతో తొలి జాబితా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాశాంతి పార్టీ తొలి జాబితాను ప్రకటించింది. 12 మంది అభ్యర్థులతో మొదటి జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 344 మంది టికెట్ కావాలని అప్లికేషన్ పెట్టుకున్నారని తెలిపింది. అన్ని వర్గాలకు తన పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. రేపు రెండో జాబితా విడుదల చేస్తామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి తాను పోటీ చేయనున్నట్టు కే.ఏ.పాల్

మిగతా 2లో



## బిల్లులపై నాన్చుడు ధోరణి వద్దు

(మొదటిపేజీ తరువాయి)

కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందిన బిల్లుల విషయంలో గవర్నర్లు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. బిల్లులకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టుకు రాకముందే గవర్నర్లు నిర్ణయం తీసుకోవాలి. బిల్లుల అంశాన్ని కోర్టు వరకు లాగొద్దు. ఈ విషయం సుప్రీంకోర్టుకు చేరినప్పుడు మాత్రమే చర్యలు తీసుకోవడానికి ముగింపు పలకాలి. తెలంగాణ విషయంలోనూ ఇలానే జరిగింది. గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారు ప్రజాప్రతినిధులు కాదనే విషయాన్ని తెలుసుకోవాలి" అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పంజాబ్ గవర్నర్ తీసుకున్న చర్యలపై తాజా స్థితి నివేదికను సమర్పించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. పంజాబ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ ఆర్థిక, విద్యా సంబంధిత చట్టాలతో సహా ఏడు కీలకమైన బిల్లులపై గవర్నర్ పురోహిత్ ఆమోదాన్ని నిలుపుదల చేశారని నొక్కి చెప్పారు. బిల్లులను వాయిదా వేసే అధికారం గవర్నర్‌కు లేదని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ అన్ని బిల్లులు పరిశీలనలో ఉన్నాయని గవర్నర్ ఇప్పటికే స్పష్టం చేశారని, అయితే నిర్ణయం ఇంకా తెలియజేయలేదని చెప్పారు. దీనికి సంబంధించిన స్టేటస్ రిపోర్టును శుక్రవారం కోర్టుకు తెలియజేస్తామని తెలిపారు. గవర్నర్ తీసుకున్న చర్యలను కోర్టు ముందు ఉంచాలని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలు స్పష్టం చేశారు.

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం ఇవ్వడంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ జాప్యం చేస్తున్నారని దాఖలు చేసిన పిటిషన్‌పై కేరళ తరపున మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదనలు వినిపించారు. కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రస్తావించారు. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ రెండేళ్లుగా రాష్ట్ర బిల్లులను నిలిపివేసినట్లు తెలిపారు. "ఈ పిటిషన్ దాఖలు చేసిన తరువాత, 'మేము సుప్రీంకోర్టులో పోరాడుతాము' అని గవర్నర్ చెప్పినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి" అని వేణుగోపాల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈ కేసును శుక్రవారానికి వాయిదా వేస్తూ అదే రోజు కేరళ, తమిళనాడు గవర్నర్లపై దాఖలు చేసిన పిటిషన్లు కూడా విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఇదిలావుండగా, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది కీలక బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రం కూడా గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం కూడా ఇదే విధమైన పిటిషన్‌ను దాఖలు చేసింది. 5 బిల్లులపై గవర్నర్ పురోహిత్ నిర్ణయం తీసుకోలేదని పంజాబ్ ప్రభుత్వం పిటిషన్ చేయగా, 12 బిల్లులపై గవర్నర్ రవి తన ఆమోదాన్ని నిలుపుదల చేశారని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన 27 బిల్లుల్లో 22 బిల్లులకు పురోహిత్ ఆమోదం తెలిపారు. చాలా రాష్ట్రాల్లో సిఎంకు గవర్నర్లకు ఉన్న వైరంలాగే పంజాబ్ సిఎం భగవంత్ మాన్ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య వైరం నెలకొంది. ఇటీవలే పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ఆమోదానికి గవర్నర్ తాత్సారం చేయడంతో ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. నవంబర్ 1న పురోహిత్.. భగవంత్ మాన్‌కు లేఖ రాసిన కొన్ని రోజుల తర్వాత, మూడు ద్రవ్య బిల్లులలో రెండింటికి ఆమోదం తెలిపారు. సభలో ద్రవ్య బిల్లులు పెట్టాలంటే గవర్నర్ ఆమోదం తప్పనిసరి. అయితే, అక్టోబరు 19న సీఎంకు రాసిన లేఖలో గవర్నర్ మూడు ద్రవ్య బిల్లుల ఆమోదాన్ని నిలిపేశారు. వాటిల్లో పంజాబ్ ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు–2023, పంజాబ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సవరణ) బిల్లు – 2023, ఇండియన్ స్టాంప్ (పంజాబ్ సవరణ) బిల్లు –2023 ఉన్నాయి. బడ్జెట్ సెషన్‌కు పొడిగింపుగా అక్టోబర్ 20–21న నిర్వహించిన సెషన్ చట్టవిరుద్ధమని గవర్నర్ గతంలో వ్యాఖ్యానించారు.

## గాజాను రెండుగా విభజించిన ఇజ్రాయిల్ సైన్యం

(మొదటిపేజీ తరువాయి)

డేనియల్ హగారీ మీడియాకు వెల్లడించారు. బందీలను వదిలిపెట్టేవరకు కాల్పుల విరమణ ప్రస్తావన ఉండదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ ప్రకటించారు. గెలిచే వరకు యుద్ధం కొనసాగిస్తామని, మాకు మరోమార్గం లేదని మరోసారి స్పష్టం చేశారు. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఆదివారం సమావేశమైన సంగతి తెలిసిందే. పాలస్తీనా సమస్యకు సమగ్ర పరిష్కారం చూపితే, గాజాలోను పాలస్తీనా అథారిటీ అధికారంలోకి తిరిగి రాగలదని అబ్బాస్ బ్లింకెన్‌తో అన్నట్లు రాయిటర్ వార్తా సంస్థ తెలిపింది. గాజా సంధి కుదుర్చుకోవాలని అరబ్ నాయకులతో కలసి అబ్బాస్ అమెరికాను కోరినట్లు తెలుస్తోంది. ఆంటోనీ బ్లింకెన్ పర్యటన అనంతరం ఈ కీలక పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

## జబాలియా శరణార్థి శిబిరంపై మళ్లీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ సమావేశమయ్యారు. పాలస్తీనా సమస్యకు సమగ్ర పరిష్కారం చూపితే, గాజాలోను పాలస్తీనా అథారిటీ అధికారంలోకి తిరిగి రాగలదని అబ్బాస్ బ్లింకెన్‌తో అన్నట్లు రాయిటర్ వార్తా సంస్థ తెలిపింది. గాజా సంధి కుదుర్చుకోవాలని అరబ్ నాయకులతో కలసి అబ్బాస్ అమెరికాను కోరినట్లు తెలిసింది.

**ఇజ్రాయెల్ మంత్రి తొలగింపు**

గాజా స్ట్రిప్‌పై అణుబాంబు వేసే అంశాన్ని ఇజ్రాయెల్ పరిశీలిస్తుందని మంత్రి అమిహై ఎలి యహు చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనను నెతన్యాహు తన మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేశారు.

# సింగరేణి తెలంగాణ సొత్తు

(మొదటిపేజీ తరువాయి)

సుందరంగా ఉందన్నారు. ఇదంతా మంత్రి అజయ్ కృషి ఫలితమేనని తెలిపారు. ఖమ్మం నగరంలో 1500 కి.మీ రోడ్లు, 1592 కి.మీ డ్రయినేజీలు నిర్మించామన్నారు. నూతన బస్టాండ్, ఐటీ హబ్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. మున్నేరు వరదల నుంచి విముక్తి కోసం రూ.700 కోట్లు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో పార్టీ మారే వ్యక్తి తుమ్మల నాగేశ్వరరావు అని బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజరు కుమార్ అన్నారు. సభలో బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ సత్తుపల్లి, పాలేరు, మధిర, వైరా నియోజకవర్గాల అభ్యర్థులు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, లింగాల కమల్ రాజ్, బాణోత్ మదన్ లాల్, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం సింగరేణి ప్రకాశం మైదానంలో నిర్వహించిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. నల్ల బంగారమైన సింగరేణి తెలంగాణ సొత్తుని, చేతకాని కాంగ్రెస్ నాయకుల కారణంగా కేంద్రానికి 49 శాతం వాటా ఇవ్వాల్సి వచ్చిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా బంగారు తునక అవుతుందని అన్నారు. రాష్ట్రంలో 134 ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి పూర్తిగా తెలంగాణ ఆస్తి అని అన్నారు.

తెలంగాణ రాక ముందు సింగరేణి లాభాలు రూ.419 కోట్లు మాత్రమే ఉండేదని, తెలంగాణలో రూ. 2124 కోట్లకు తీసుకు పోయామని తెలిపారు. నూతన నియామకాల వల్ల యువ ఉద్యోగులతో కళకళ లాడుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాలు తీసి వేసిందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిట్టు చెప్పారు. గని కార్మికుడు చనిపోతే కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు రూ.10 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని బేరీజు వేసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని, వచ్చేది మన ప్రభుత్వమేనని మిగిలిన పనులు పూర్తిచేసి తానే ప్రారంభిస్తానని చెప్పారు.

జిల్లాలో 16,769 ఎకరాల పోడు భూములను 4500 మంది గిరిజన కుటుంబాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు నామ నాగేశ్వరరావు. పార్థసారధిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఎమ్మెల్యే అభ్యర్థులు వనమా వెంకటేశ్వరరావు, బి.హరిప్రియ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశాంతి పార్టీ తొలి జాబితా


(మొదటిపేజీ తరువాయి)

**ప్రజాశాంతి పార్టీ తరుపున తొలి జాబితా అభ్యర్థులు**

చెన్నూరు–మొయ్య రాంబాబు జుక్కల్ (ఎస్సీ) కర్రోల్ల–మోహన్ రామగుండం–బంగారు కనకరాజు వేములవాడ–అజ్మీరా రమేష్ బాబు నర్సాపురం–సిరిపురం బాబు జహీరాబాద్ –బేగరి దశరథ గజ్వేల్–పాండు ఉప్పల్ –కందూరు అనిల్ కుమార్ యాకత్ పురా– సిల్లివేరు నరేష్ కల్వకుర్తి–కట్టా జంగయ్య, నకిరెకల్ –కదిర కిరణ్ కుమార్ మధిర–కొప్పుల శ్రీనివాస్ రావు.

# కేసీఆర్‌ను ఢకొట్టే సత్తా ఎవరికీ లేదు

## -మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం కేసీఆర్‌ను ఢకొట్టే సత్తా ఎవరికీ లేదని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల్లో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్‌ను ఓడించేందుకు ఢిల్లీ నుంచి గుంపులు గుంపులుగా వివిధ పార్టీలకు చెందిన మహా మహా నాయకులు నరేంద్ర మోడీ, అమిత్ షా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లాంటి వారు ఎంత మంది వచ్చినా ఒరిగేది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మాత్రం సింహం లాగా సింగిల్ గానే వారిని ఎదుర్కొంటారని అన్నారు. ఢిల్లీ గులాములు కావాలో.. తెలంగాణ బిడ్డలు కావాలో రేపు జరగబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కోరిక మేరకు ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆమనగల్‌లో అవసరమైన కార్యాలయాలు, వెల్జాల్, గట్టు ఇప్పలపల్లి, రఘుపతి పేట తదితర గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన జైపాల్ యాదవ్‌ను మరోసారి గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీగా నగదు, మాదకద్రవ్యాల స్వాధీనం

## తెలంగాణలో అత్యధికంగా 439 కోట్లు స్వాధీనం

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి భారీగా నగదు, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న వాటి విలువ మూడు రెట్లు ఎక్కువగా ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికలు జరిగే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన అక్టోబర్ 9వ తేదీ నుండి ఇప్పటి వరకూ రూ.953.34 కోట్ల నగదుతో పాటు నగలు, బంగారం, వెండి, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాష్ట్రాల్లో 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా కేవలం రూ.288.58 కోట్ల విలువైన వస్తువులు, నగదును మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. అంటే ఈసారి గతంతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువ రూ.660 కోట్లు పెరిగింది. చాలా ప్రాంతాల్లో పోలింగ్‌కు ఇంకా ఇరవై ఐదు రోజుల సమయం ఉంది. అప్పటికి స్వాధీనం చేసుకునే నగదు, ఇతర వస్తువుల విలువ భారీగా పెరగవచ్చునని భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 31వ తేదీ నాటికి రూ.38.34 కోట్లు, మధ్యప్రదేశ్‌లో ఈ నెల 1వ తేదీ నాటికి రూ.226 కోట్లు, మిజోరంలో గత నెల 25వ తేదీ నాటికి రూ.36 కోట్లు, రాజస్థాన్‌లో గత నెల 24వ తేదీ నాటికి రూ.214 కోట్ల విలువైన వస్తువులు, నగదు స్వాధీనం చేసుకోగా తెలంగాణలో ఈ నెల 2వ తేదీ నాటికి అత్యధికంగా రూ.439 కోట్ల నగదు, ఇతర వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఇందులో రూ.156 కోట్ల నగదు ఉండగా రూ. 165.2 కోట్ల విలువైన 1,300 కిలోల బంగారం, వెండి, ఇతర లోహాలు, రూ.49.4 కోట్ల విలువైన మద్యం, రూ.24.7 కోట్ల విలువైన గంజాయి ఉంది. ఆదాయపన్ను శాఖ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బృందాలను నియమించి, విస్తృతంగా తనిఖీలు జరుపుతోంది. విమానాశ్రయాల వద్ద ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పట్టుబడిన నగదు, ఇతర వస్తువుల విలువ కేవలం రూ.137 కోట్లు మాత్రమే. ఇందులో రూ.125 కోట్ల నగదు ఉంది. మిజోరం శాసనసభలోని 40 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లోని 20 నియోజకవర్గాలకు రేపు పోలింగ్ జరుగుతుంది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలోని మిగిలిన 70 స్థానాలతో పాటు మధ్యప్రదేశ్‌లోని మొత్తం 230 నియోజకవర్గాలకు ఒకే విడతలో ఈ నెల 17న ఎన్నికలు జరుగుతాయి. రాజస్థాన్‌లో 200 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 25న, తెలంగాణలోని 119 స్థానాలకు ఈ నెల 30న పోలింగ్ జరుగుతుంది.

# ఓయూ పీఎస్ పరిధి ఇఫ్లూ లో విద్యార్థుల ఆందోళన..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

లైంగిక వేధింపులకు గురైన అమ్మాయికి న్యాయం చేయాలని ఓయూ పీఎస్ పరిధిలో విద్యార్థులకు ఆందోళనకు దిగారు. ఇఫ్లూ విసికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. దీంతో ఓయూకు పోలీసులు భారీగా చేరుకున్నారు. ఇఫ్లూ గేట్ బయట ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గేట్ లోపల విద్యార్థులు ఇంకా ఆందోళన కానసాగిస్తున్నారు. అరెస్టు చేసిన పలువురు విద్యార్థులను పోలీసులు ఓయూ పీఎస్ కు తరలించారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టారని విద్యార్థుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇఫ్లూ విద్యార్థుల ఆందోళనకు ఐద్వా, ఎన్ఎస్ యూఐ, ట్రాన్స్ జెండర్,మహిళ సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు.



## నియోజకవర్గ అభివృద్ధి మంచి రెడ్డికే సాధ్యం

# మంచి రెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించాలి

**- బిఎన్నార్ ట్రస్టు చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి**

**మాజీ సర్పంచ్ రాజు నాయక్**



యాచారం- ప్రభాత సూర్యుడు: యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం మొదలు పెడుతూ ఎస్సీ వాడ ఎల్లమ్మ గుడి (లంద) దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలవాలని శేఖర్ రెడ్డి, రాజు నాయక్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలనీవాసులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను గ్రామ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు .గుర్తుల గుర్తు గుర్తుంచుకొని కారు గుర్తుకు ఓటెయ్యాలని బిఆర్ఎస్ నాయకులు గడపగడపకు తిరిగి ప్రజలను చైతన్యం చేస్తూ వివరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మారోజు వెంకటేష్ , గౌర శేఖర్ ,కొండాపురం శ్రీశైలం, జనిగ వెంకటేష్ , పేరుమల రమేష్ , ఎంజాల చందు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జన చైతన్య యాత్ర మహేష్ కి స్వాగతం పలికిన

## బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రశాంత్ రెడ్డి



ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు : రాష్టానికి కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామ రక్ష, భారత రాష్ట్ర సమితి నే భరోస అని రాష్ట్రమంతా ద్వి చక్రవాహనంపై జన చైతన్య యాత్ర రూపంలో జనాన్ని చైతన్యవంతులను చేస్తూ ఇబ్రహీంపట్నం నియజకవర్గానికి చేరిన శామిర్ పేట్ కు చెందిన దివ్యాంగుడు మహేష్ ను రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటీ) ఘన స్వాగతం పలికి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కపేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలకల బుగ్గ రాములు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు జెర్కోని రాజు, మాజీ చైర్మెన్ భరత్, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి మల్ రెడ్డి రంగారెడ్డి

**-కాంగ్రెస్ పార్టీ లో చేరిన తాళ్లపల్లిగూడ నాయకులు**



మంచాల - ప్రభాత సూర్యుడు:మంచాల మండల పరిధి లోని తాళ్లపల్లిగూడ గ్రామానికి చెందిన ఓబిసి మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు యశమోని శేఖర్ యాదవ్, బిజెపి నాయకులు కాస కుమార్ యాదవ్, ఎర్పుల శ్రీనివాస్, గండికోట అశోక్, పోలమోని భాను ముదిరాజ్ సోమవారం మల్ రెడ్డి రంగా రెడ్డి సమక్షంలో, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మునికుంట్ల సంతోష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ వెదిరే హనుమంత్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండి వాజీద్, కాంగ్రెస్ పార్టీ మంచాల మండల ప్రధాన కార్యదర్శి కాస గణేష్ యాదవ్, రంగోలు నవీన్ గౌడ్, సుంకం రాజు, గుంతకండ్ల లింగస్వామి యాదవ్, నర్ల రమేష్ యాదవ్, సుంకం శంకర్ పాల్గొన్నారు.

## నలుగురు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

**- రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి**

ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నాలుగురు అభ్యర్థులు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డికి సమర్పించారు. బి ఆర్ ఎస్ పార్టీ శాసనసభ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి తరపున మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేసిన మంచిరెడ్డి ముకుంద కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు ముద్దగౌని రాజ్యలక్ష్మి స్వతంత్ర అభ్యర్థి దండెం రాంరెడ్డి స్వతంత్ర అభ్యర్థి తులసిగారి రవీందర్ ధర్మసమాజపార్టీ.




# ప్రజల కోసమే తెలంగాణ ఎన్నికల్లో పాల్గొనలేదు : వైఎస్ షర్మిల

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:ప్రజల కోసమే తెలంగాణ ఎన్నికల్లో పాల్గనకుండా ఉన్నామని వైఎస్సార్‌టీపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఎవరో తమకు కిరీటాలు పెట్టాలని కోరుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై కేసు కొట్టేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. అన్ని పార్టీల్లో దొంగలుంటారని.. కానీ ఆ దొంగలు సీఎంలు కాకూడదని ఆమె వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకఅష్ణారెడ్డిని ఉద్దేశించి షర్మిల పలు వ్యాఖ్యలు చేశారు.



వైఎస్సార్‌టీపితో సంబంధం లేదని గతంలో సజ్జల అన్నారని.. ఇప్పుడు ఏ సంబంధం ఉందని తన గురించి ఆయన మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తాము మాత్రం సంబంధం లేదనే అనుకుంటున్నామని వ్యాఖ్యానించారు. "మాతో సంబంధం గురించి సజ్జలే సమాధానం చెప్పాలి. ఏపీలో రోడ్లు, విద్యుత్‌పై తెలంగాణ సీఎం కేసీఆర్ బాహాటంగానే విమర్శించారు. ఆయన వ్యాఖ్యలపై సజ్జల ఏం సమాధానం చెబుతారు?సజ్జల గారూ.. ముందు మీ కథ మీరు చూసుకోండి" అని షర్మిల ఎద్దేవా చేశారు.

# మంథనిలో జరిగే కెసిఆర్ ఆశీర్వాద సభకు తరలిరండి

**బి ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కిషన్ రెడ్డి**

కమాన్ పూం - ప్రభాత సూర్యుడు : మంథని నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి కే. సీ. ఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కమాన్ పూర్ మండల బీ.ఆర్. ఎస్ పార్టీ నాయకులు కోరారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బీ. ఆర్. ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కమాన్ పూర్ మండలంలోని కమాన్ పూర్, జూలపల్లి, గుండారం, పేరపల్లి, రొంపికుంట, నాగారం, పెంచికల్ పేట్, సిద్దిపల్లె, గొల్లపల్లి గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, బీ. ఆర్. ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్శకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని ఏద్దేవా చేశారు. కమాన్ పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే మళ్ళీ కండువాలు కప్పి చేర్చుకోవడం విడ్డురంగా ఉందాన్నారు. బీ. ఆర్. ఎస్ పార్టీ



అధికారంలోకి వచ్చిన నాటి నుండి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందన్నారు.

మంథని నియోజకవర్గం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాల్లో తోడుంటా.. పుట్ట లింగమ్మ చారిటేబుల్ ట్రస్ట్ పేరుతో మంథని నియోజకవర్గ బీ. ఆర్. ఎస్ అభ్యర్థి, జడ్పి చైర్మన్ పుట్ట మధు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనస్సులో నిలిచాడన్నారు. మంథనిలో మరోమారు బీ. ఆర్. ఎస్ అభ్యర్థి పుట్ట మధు గెలవడం తాధ్యమని, మళ్ళీ రాష్ట్రంలో కే. సీ. ఆర్ సారథ్యంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో బీ. ఆర్. ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, ఎంపిపి రాచకొండ లక్ష్మి, రైతు బందు సమితి మండల అధ్యక్షులు గడప కృష్ణమూర్తి, మండల ఎంపిటిసిల ఫోరమ్ అధ్యక్షులు బోనాల వెంకటస్వామి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు బొల్లపెల్లి శంకర్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, వైస్ ఎంపిపి ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, జిల్లా నాయకులు ఇనగంటి రామారావు, సర్పంచ్‌లు నీలం సరిత, తాటికొండ శంకర్, కొండ వెంకటేష్, మాజీ జడ్పిటిసి మేకల సంపత్ యాదవ్, ఏ. ఎం. సి వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ పి. ఏ. సి. ఎస్ చైర్మన్ బాద్రపు మల్లేష్, ఉప సర్పంచ్ లు బొజ్జ రాజసాగర్, పోలుదాసరి సాయికుమార్, నాయకులు నీల రాజయ్య, పోలుదాసరి వినోద్, అబ్బిడి సంతోష్ రెడ్డి, నీలం శ్రీనివాస్, అనవేన లక్ష్మీరాజం, మేరుగు వెంకటేశ్వర్లు, సూద్దాల మూర్తి, బంగారు గట్టయ్య, తోట వీరయ్య, బొల్లపెల్లి లక్ష్మయ్య గౌడ్, కొండ రమేష్, రేగుల మొగిలి, దాసరి రాంచంద్రం, భూంపెల్లి మల్లేష్, భీమయ్య, గోడిసేల స్వామిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.


## గడప గడపకు బిజెపి ప్రచారం



చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు మరియు మోడీ ప్రజలకు చేసిన సేవలు మెదక్ నియోజకవర్గ ప్రజలు గుర్తుంచుకొని భారీ మెజార్టీతో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్ ముదిరాజును గెలిపించుకుంటామని శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లూరిరాజు అన్నారు. అధిష్టానం బడుగు బలహీన వర్గాల కు చెందిన అభ్యర్థిని గుర్తించి పార్టీ టికెట్ ఇవ్వడం చాలా సంతోషమని ఆయన అన్నారు . సోమవారం నియోజకవర్గంలోని నిజాంపేట మండలంలో పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్న సమయంలో ప్రజల నుంచి వచ్చే స్పందన మా గెలుపుకు నిదర్శనమని ఆయన అన్నారు. ఎంతమంది ఉన్నత వర్గాలు నిలబడ్డ మా గెలుపు ఖచ్చితమని మెదక్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జే మల్లారెడ్డి సీనియర్ నాయకులు నందారెడ్డి,వనం నర్సింలు, మండల మహిళా మోర్చా అధ్యక్షులు మంజుల ,శక్తి కేంద్రం శంకరంపేట పట్టణ అధ్యక్షులు మేడి శ్రీను ముదిరాజ్ , మహేందర్, సురేష్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## కొడంగల్‌లో నామినేషన్ దాఖలు చేసిన రేవంత్‌రెడ్డి

కొడంగల్ -ప్రభాత సూర్యుడు: కర్ణాటక పీసీసీ అధ్యక్షుడికి లక్ష 20వేల మెజారిటీ వచ్చిందని, కొడంగల్‌లో అంతకంటే ఎక్కువ మెజారిటీతో తనను గెలిపించాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. కొడంగల్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతోందన్నారు. "కొడంగల్‌లో గతంలో బిఆర్ఎస్‌ను గెలిపించినా అభివఅద్ధి జరగలేదు. కొడంగల్‌లో పోటీ చేయాలని కేసీఆర్, కేటీఆర్‌కు సవాల్ విసిరాను. నాకు ఇచ్చిన కాంగ్రెస్ అధ్యక్ష పదవి.. నాకోసం కాదు.. మీకోసమే. ఈ ఐదేళ్లలో కొడంగల్ నియోజకవర్గానికి ఏమైనా అభివఅద్ధి జరిగిందా?కొడంగల్ ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్ మళ్లీ ఎలా ఓట్లు అడుగుతుంది. కొడంగల్ యువతకు ఉద్యోగాలు అందించేందుకు జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలు. ఈ ఎన్నికలు మన భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయి" అని రేవంత్ అన్నారు.



## బిఆర్ఎస్ పార్టీలోకి కొనసాగుతున్న చేరికలు

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు



పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి పసుమాముల గ్రామానికి చెందిన బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముసలిగారి రాజు గౌడ్ బిజెపి పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాజు గౌడ్ తో పాటు శ్రీనివాస్ గౌడ్ ,లక్ష్మణ్ గౌడ్ ,సంధ్యారాణి, గూడెపు దేవి, బాలమణి, రాజు, అజయ్ వంశీ, మరో 20 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నూతనంగా బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన వారిని ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్, పాడి జంగయ్య, సీనియర్ నాయకులు గోవర్ధనం ప్రవీణ్ కుమార్, కాటం శ్రీనివాస్ గౌడ్, చెట్టి నవీన్ గౌడ్, కొత్తపల్లి జితేందర్ రెడ్డి, కాటం అంజన్ గౌడ్ , జోర్క వెంకటరమణ ,కాటం సంపత్, మోతే రాజు, బబ్బూరి అన్వేష్, వంశీ, సురేష్, చెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ

## అధికారంలోకి రావడం ఖాయం

**-కాంగ్రెస్ మ్యానిఫెస్టో తో రైతులు,యువకులు, మహిళలు, నిరుపేదలకు లబ్ధి**

**-ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

మంథని --ప్రభాత సూర్యుడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ మ్యానిఫెస్టో తో రైతులు,యువకులు, మహిళలు, నిరుపేదలకు లబ్ధి చేకూరనున్నదని ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు.మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ నారమల్ల లక్ష్మీరాజం తో పాటు వందమందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి శ్రీధర్ బాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ఎంతో భరోసా నిస్తున్నాయన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215